సాగుకు సిద్ధమవుతున్న రైతులు

- వేసవి దుక్కుల్లో నిమగ్నం
- ప్రకృతిపై గంపెడాశలు



మాచినేనిపేటతండాలో ట్రాక్టర్‌తో మిరప కట్టె తొలగిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా రైతులు వేసవి దుక్కులు చేస్తున్నారు. యాసంగి సీజన్ ముగియడంతో పత్తి, మిరప, మొక్కజొన్న తదితర ఎండిపోయిన కట్టెను ట్రాక్టర్లతో తొలగించి వాటిని కాల్చి పొలాలను శుభ్రం చేస్తున్నారు. వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరిలో వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. వేసవి దుక్కులు దున్నే ముందు పశువులు ఎరువు, కంపోస్టు ఎరువు, మట్టి వెదజల్లడం వల్ల ద్వారా సారవంతమైన నేలగా మారడం, తేమ శాతం పెరగడంతోపాటు పంట అధిక దిగుబడి పెరుగుతుంది. ఇటీవల అకాల వర్షాలు కురవడంతో దుక్కి దున్నడానికి అనుకూలంగా ఉండటంతో రైతులు వేసవి దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. జూలూరుపాడు మండలంలో ప్రధానంగా వాణిజ్య పంటలు పత్తి, మిరప పంటలను అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. గత ఏడాది పత్తి 16,050 ఎకరాలు, వరి 3,482, పెసర 55, మినుములు 50, కందులు 260, మిర్చి 6,052 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలం పంటలపై వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తున్నది. ఈ ఏడాది పత్తి పంట సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్లు కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది కానీ మార్కెట్‌లో మద్దతు ధర లభించడంతో రైతులకు లాభసాటిగా ఉంది. అయితే మిర్చి పంటకు వైరస్ సోకడంతో మిర్చి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయినా మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి ధర లభించడంతో ఈ ఏడాది కూడా రైతులు మిర్చి పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ప్రకృతి సహకరిస్తుందని కోటి ఆశలతో పంటల సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు.



కాకర్లలో మిరప కట్టెను తగలబెడుతున్న రైతు



వెంగన్నపాలెంలో దుక్కి దున్నుతున్న దృశ్యం

పంటకు మంచి ధర వచ్చింది



దుక్కులు సిద్ధం చేస్తున్నాం. గతేడాది 10 ఎకరాల్లో పత్తి, 5 ఎకరాల మిర్చి పంట సాగు చేశాను. అధిక వర్షాలు కారణంగా పత్తి పంట దిగుబడి తగ్గినప్పటికీ మద్దతు ధర లభించింది. మిర్చి పంటకు తెగుళ్ల సోకి దిగుబడి గణనీయంగా తగ్గింది కానీ, మంచి ధర వచ్చింది. నష్టం వచ్చినా లాభం వచ్చినా భూదేవిని నమ్ముకుంటున్నాం.

– సాయిన్ని శ్రీనివాసరావు, రైతు, కొత్తూరు

వేసవి దుక్కులు పూర్తయ్యాయి



పత్తి, మిరప కట్టెను ట్రాక్టర్‌తో తొలగించి దుక్కి దున్నడం పూర్తయింది. వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. గతేడాది అధిక వర్షాలు కారణంగా పత్తి పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి పంటకు వైరస్ సోకి దిగుబడి తగ్గిపోయింది.

– సాయిల రామారావు, రైతు, వెంగన్నపాలెం

లోతు దుక్కులు దున్నాలి



వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి. ఎండ తీవ్రత వల్ల కోశస్త దశ పురుగులు, గుడ్లు చనిపోతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పొడి దుక్కులు దున్నడం ఎంతో మంచిది. అంతేకాకుండా వర్షాలు రాగానే విత్తనాలు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. మెత్తటి దుక్కి వలన గింజలు త్వరగా మొలకెత్తుతాయి.

– ఎస్ రఘుదీపిక, ఏఓ, జూలూరుపాడు

భద్రతపై అవగాహన పక్షోత్సవాలు



ఓసీలో భద్రతపై అవగాహన పక్షోత్సవాలు ప్రారంభిస్తున్న పీఓ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో రక్షణపై అవగాహన పక్షోత్సవాలను సేఫ్టీ అధికారి పంజాల శ్రీనివాసు, పీఓ బి. వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. మాట్లాడుతూ... ఓసీలలో లైట్ మోటార్ వాహనాలు, వాటి కదలికలు, ఉద్యోగుల రవాణా కోసం ఇతర వాహనాలపై భద్రత అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లు వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో నిలపాలన్నారు. రక్షణ పరికరాలు తప్పక ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో గని మేనేజర్ పూర్ణచందర్ రావు, ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, వి.కిషన్, డిప్యూటీ మేనేజర్ డీవైపీఎం శ్రీహరి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు రంగనాథ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాన్ని సందర్శించిన డీజీఎం...

పట్టణంలోని 24 ఏరియా గ్రౌండ్‌లో జరుగుతున్న క్రీడా శిబిరాన్ని డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు సందర్శించి పరిశీలించారు. ఆయన వెంట క్రీడల కార్యదర్శి శ్రీహరి ఉన్నారు.

బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్ష



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయం, జేవీఆర్ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీలను, బొగ్గు రవాణా విధానాన్ని బుధవారం సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై ఏరియా జీఎం జక్కం రమేష్‌తో చర్చించారు. ఏరియాలో ఉత్పత్తిని పెంచాలని, రోజు, నెలవారీ బొగ్గు ఉత్పత్తితోపాటు, ఓబీ రిమూవల్‌ను పెంచాలని, అసౌకర్యాలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో అడ్వైజర్ డీఎన్ ప్రసాద్, జీఎం సీపీపీ కొండయ్య, స్వామి నాయుడు, వైజేకే మూర్తి, సూర్యకుమార్, ఏరియా ఇంజనీర్ రఘురామిరెడ్డి, వీకే7 ఓసీ పీఓ శ్రీరమేష్ తదితరులు పాల్గొన్నారు.

21న 'చలో వైజాగ్'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈనెల 21న విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ఆదివాసీలను అడవి నుంచి తరిమేసే కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. హక్కుల రక్షణ కోసం, జాతి మనుగడ కోసం, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిర్వహించాల్సిన పోరాటాలపై సదస్సులో కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మూడు మాలు, జోగ కృష్ణ, బుర్రి ప్రవీణ్, మోతీలాల్, ముత్యాలు, పాపయ్య, నర్సయ్య, సురేష్, ఎర్రయ్య, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

ఇల్లెందురూరల్: వర్షాకాలంలో మురుగు సమస్య తలెత్తకుండా పారిశుద్ధ్యం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ సూచించారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్, డంప్‌షెడ్డులను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన ప్రారంభోత్సవం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూనెం లింగమ్మ, కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



చుంచుపల్లి: రామాంజనేయ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



ఇల్లెందు: శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, కమిషనర్ అంకుషావలి

చుంచుపల్లి: గ్రామపంచాయతీల పరిధిలో వారం రోజుల పాటు పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా బుధవారం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల పరిధిలో తొలిరోజు కార్యక్రమాలను చేపట్టారు. మొదటిరోజు గ్రామ పంచాయతీల పరిధిలో వీధులు, డ్రెయిన్లు, రోడ్లను శుభ్రపరిచారు. ఖాళీ స్థలాలల్లో పిచ్చి చెట్లను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రైవేటు స్థలాలను గుర్తించి వాటిని శుభ్రపరచాలని యజమానులకు సూచించారు. గురువారం రెండో రోజు గ్రామపంచాయతీల్లో వైకుంఠధామాలు, డంపింగ్ షెడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మార్కెట్ ప్రదేశాలు, బస్టాప్‌లను శుభ్రపరుస్తారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ఆ గుంతలను పూడ్చివేస్తారు. అన్ని వైకుంఠధామాల్లో సోలార్ లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటారు. తొలిరోజు ఆయా మండలాల పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

ఇల్లెందు: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మున్సిపల్ పట్టణాల్లో శానిటేషన్ పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ 1, 2వ వార్డుల్లో శానిటేషన్ పనులను ప్రారంభించారు. తడి, పొడి చెత్తను బయట వేయరాదని ప్రజలకు సూచించారు. పట్టణంలో జరుగుతున్న శానిటేషన్ పనుల్లో ప్రజలు, కౌన్సిలర్లు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వార రవి, కటకం పద్మావతి, ఏఈ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు



టేకులపల్లి: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

ఇల్లెందురూరల్: సీఎం కప్ క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. నిర్దేశించిన విభాగాలలో యువతకు పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనే జట్లను ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో విభాగాలలో మహిళలు, పురుషుల జట్లను, వాలీబాల్ పురుషుల జట్టును, అథ్లెటిక్స్ విభాగంలో ఆరుగురు పురుషులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలరాజు మాట్లాడుతూ.. మండుటెండలోనూ అందరి సహకారంతో పోటీలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన పోటీలు...

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన సీఎం కప్ 2023 క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు మండలం నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరై పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 40 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ బోడ సరిత, ఎంపీఓ కోట వీరబాబు, ఎంపీఓ గణేష్ గాంధీ, ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్, జయకృష్ణ, ఎల్.కిరణ్, వి.ప్రశాంత్, పీఈటీ, ఉపాధ్యాయులు భూక్యా సైదులు, భూక్యా కస్నా, వి.నరేష్, అంజయ్య, ఉషాకిరణ్, మంగాదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: మస్సివాగు తండా గ్రామపంచాయతీ పరిధిలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రూ.25వేల విరాళం అందించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ బీఆర్ఎస్ నాయకుడు బోడ రమేష్‌కు బుధవారం చెక్కు అందజేశారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

జూలూరుపాడు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29న ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని బానోత్ విజయాబాయి తెలిపారు. బుధవారం జూలూరుపాడులో వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, నర్వనేని పుల్లారావు, పోతురాజు నాగరాజు, కోటకుమార్ బాబు పాల్గొన్నారు.

సిగ్నల్‌కు ఆటంకం



సెల్ సిగ్నల్ కోసం అడవిలో ఇబ్బంది పడుతున్న గిరిజనులు

పాల్వంచరూరల్: అసలే ఏజెన్సీ ప్రాంతం.. అందులో నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో ఇంటర్‌నెట్ సిగ్నల్ కోసం గిరిజనులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని చంద్రాలగూడెం, రేగులగూడెం గ్రామపంచాయతీల పరిధిలో తునికాకు సేకరణ కూలీలకు తునికాకు బోనస్ డబ్బులను అకౌంట్‌లో జమ చేయనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడానికి ఇంటర్‌నెట్ సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో కూలీలు సెల్ సిగ్నల్ కోసం నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరం అటు ఇటూ నడిచి అవస్థలు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని వార్డుల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బుధవారం బర్మా క్యాంపులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించి మాట్లాడారు. కంటి లోపాలున్న వారిలో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టి కంటి పరీక్షలు జరిపి, కళ్లజోళ్లను సైతం ఉచితంగా పంపిణీ చేస్తుందని వివరించారు. ప్రజలందరూ శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. వనచర్ల విమల, కరుణ, గంగాభవాని, రామసీత, దేవి, కృపా, నాగమణి, బీఆర్ఎస్ నాయకులు కొండస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్‌సీలు, స్థానికులు పాల్గొన్నారు.

క్యాంటిన్‌లో భోజన వసతి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి జేకే ఓసీలోని క్యాంటిన్‌లో కార్మికుల సౌకర్యార్థం మధ్యాహ్నం, రాత్రి విధుల్లో ఉన్న కార్మికులకు భోజన వసతి కల్పించాలని టీబీజీకేఎస్ కోరింది. బుధవారం గని మేనేజర్‌కు సంఘం తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఎస్.రంగనాథ్ మాట్లాడారు. ఇతర ఓసీల వలే ఇల్లెందులోనూ కార్మికులకు భోజన వసతి కల్పించాలని కోరారు. కార్మికులలో ఎక్కువ మంది 50 ఏళ్ల పైబడిన వారు ఉన్నారని, అంతా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల సౌకర్యార్థం భోజన వసతి కల్పిస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. ఓసీలలో విపరీతమైన వేడి ఉంటుందని, అధిక ఉష్ణోగ్రతల వల్ల కార్మికులు అనారోగ్యబారిన పడుతున్నారని వాపోయారు. కార్మికుల పని వేళలు మార్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కళ్లం కోటిరెడ్డి, గౌసమియా, కోటయ్య, బోలా, రామారావు, సతీష్, అజీజ్, ప్రభాకర్, రమేష్, రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



కూసన వీరభద్రంను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చుంచుపల్లి: శ్రమశక్తి అవార్డు గ్రహీత బాబూ క్యాంపు ఎంపీటీసీ కూసన వీరభద్రంను జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఇటీవల అవార్డుల్లో చుంచుపల్లి మండలం ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నట్లు చెప్పారు. తొలుత గౌతంపూర్‌కు ఉత్తమ పంచాయతీగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం, అదేవిధంగా ఎంపీటీసీ కూసన వీరభద్రం కార్మికులకు చేసిన సేవలకు గుర్తింపుగా శ్రమశక్తి అవార్డు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, ఎంపీటీసీలు నాగమణి, సరస్వతి, రుక్మిణి, కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్, భిక్షపతి, భవాని, ఏఈ నాగేందర్, సర్పంచ్ సాగర్, సీతారాములు, వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేస్తా...



మాట్లాడుతున్న నర్సయ్య ముదిరాజ్

కొత్తగూడెంటౌన్: ఉద్యమకారుల తరుపున ఈసారి కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తానని 1969 తొలిమలి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీసీగా, ఉద్యమకారుడిగా, కార్మికుడి బిడ్డగా పోటీలో నిలుస్తున్నాని ప్రజలు ఆదరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమంలో 1969 నుంచి 2014 వరకు అలుపెరగని పోరాటం చేసినట్లు చెప్పారు. ప్రజాకష్టాలు మాకు తెలుసని తెలంగాణ వచ్చిన తరువాత బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులతో పాటు సాధారణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంచి నీటికి కష్టాలే, నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితులు వచ్చాయని, ప్రజల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. సమావేశంలో ఎం.వలీబాబా, అల్లి భాస్కర్, కూచన కృష్ణారావు, కాకెల్లి సైమన్, ఎడ్ల ఎలియా, సఫ్దార్‌బేగ్, దేవులపల్లి రామ్మూర్తి, జావేద్, మాతంగి లింగయ్య పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శాంతి

చుంచుపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బాదావత్ శాంతి అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సాదాసీదాగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.మంగమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు అడిగిన అనేక సమస్యలకు మండల స్థాయి అధికారులు సమాధానాలిచ్చారు. మండలంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించారు. ప్రశాంత్‌నగర్ కాలనీ, రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథ నీటి కనెక్షన్ల నిర్మాణం పూర్తి చేసిన అధికారులను అభినందించారు. చుంచుపల్లి మండలంలోని దివ్యాంగులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సు పాస్‌లను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేస్తున్నట్లు ఎంపీడీఓ మంగమ్మ తెలిపారు.

సమస్యలపై గవర్నర్‌కు వినతిపత్రం





గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

చుంచుపల్లి: జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్‌ను బుధవారం స్థానిక కొత్తగూడెంలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో బీజేపీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గవర్నర్‌కు జిల్లాలోని పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు పైడిపాటి రవీందర్, యువ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యులు జోగు ప్రదీప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యులు కటికల రంజిత్ కుమార్, జిల్లా కార్యదర్శి నోముల రమేష్ పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుగులోత్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి



ఆత్మజ్ఞాన బోధన చేస్తున్న భాస్కర్‌రావు

టేకులపల్లి: ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం శాఖాహారులుగా మారాలని పిరమిడ్ ధ్యానం చేయాలని ఖమ్మం సీనియర్ పిరమిడ్ మాస్టర్ సేథ్ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ రావులపాడులో పిరమిడ్ మాస్టర్లు వడ్డె అప్పారావు, రాధ దంపతులు.. 2012లో నిర్మించిన వెంకటేశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రం 11వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ ఆత్మజ్ఞానం గురించి వివరించారు. అందరూ ప్రతిరోజూ ధ్యానం చేయాలని, శాకాహార భోజనం తీసుకోవాలని తెలియజేశారు. ధ్యానం సర్వరోగ నివారిణి, ధ్యానం సకల సమస్యల పరిష్కారిణి, ధ్యానం ఆత్మజ్ఞానం ప్రసాదిని అని పేర్కొన్నారు. ధ్యానం చేయడం ద్వారా దుఃఖం నుంచి బయటకు వస్తామని ఆనందకర జీవితం సాధ్యమవుతుంది చెప్పారు. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ భర్త, ఏఎంసీ చైర్మన్ భానోత్ హరిసింగ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. మేం ఇల్లెందు పిరమిడ్ మాస్టర్ వెంకటేశ్వర్లును పిలిపించుకొని ధ్యానం నేర్చుకున్నామని, మా ఇంటి పైన పిరమిడ్ నిర్మించినట్లు చెప్పారు. మేం ప్రతిరోజూ ధ్యానం చేస్తామని చెప్పారు. నా జీవితంలోకి ఎప్పుడైతే ధ్యానం వచ్చిందో అప్పటి నుంచి ఒక టాబ్లెట్ కూడా వాడటం లేదని, ఇంత ఒత్తిడిలో కూడా ఎంతో ప్రశాంతంగా ఉంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 200 మంది పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

డ్రెయినేజీల్లో పేరుకపోయిన చెత్త



జూలూరుపాడు మండలం కరివారిగూడెం గ్రామ పంచాయతీలో సైడు కాలువల్లో పూడిక, చెత్తచెదారం పేరుకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కరివారిగూడెం, తవిస్సిగుట్ట తండా, కరివారిగూడెం కాలనీలలోని డ్రెయినేజీలు మురుగుతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఏ వీధిలో చూసినా ఇదే పరిస్థితి. వేసవి కాలంలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే రాబోయే వానాకాలంలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోవడంతో దోమలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : పి.కృష్ణ, ఎంపీఓ,
సెల్ నంబర్: 9908188125